ప్రజాశక్తి
బుధవారం 20 సెప్టెంబర్ 2023 | 5 | అనంతపురం

కామ్రేడ్ రామచంద్రారెడ్డికి నివాళులు అర్పిస్తున్న రాంభూపాల్, ఓబులు

పంటకు లేదు తడి.. రైతుకంట కన్నీటి జడి..!

◆ వర్షాభావంతో ఎండుతున్న పంటలు
◆ మొక్కలను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు

మిరప పంటకు డబ్బాలతో నీరు పోస్తున్న కూలీలు

ఉమ్మడి అనంతపురం జిల్లాను ఈ ఏడాది కరువు కమ్మేసింది. కనీసం విత్తనాలు వేసుకునేందుకు కూడా వర్షాలు పడలేదు. పడిన కొద్దిపాటి వర్షానికి వేసిన పంట కూడా వర్షం లేకపోవడంతో ఎండుదశకు చేరుకుంటోంది. దీనిని కాపాడుకునేందుకు రైతులు నానావస్థలు పడుతున్నారు. కళ్లేదుటే వాడిపోతున్న మొక్కలను కాపాడుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. వర్షం జాడలేకపోవడంతో పంటకు తడి అందిచడం కష్టమై రైతుల కంట కన్నీటి సుడులు తిరుతున్నాయి.

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఉమ్మడి జిల్లాలో కరువు ఎంతలా కరాళనృత్యం చేస్తోంది అన్న దానికి బొమ్మనహాల్ మండలం బొల్లనగుడ్డం గ్రామంలో రైతులు పడుతున్న ఇబ్బందులు అద్దం పడుతున్నాయి. హెచ్ఎల్సికి సాగునీరు అందక దాని పరిసర ప్రాంతంలో సాగు చేసిన మిరప చెట్లు ఎండిపోతున్నాయి. వీటిని కాపాడుకోవడానికి ఒక్కొక్క చెట్టుకు ఒక లీటర్ నీళ్ల డబ్బాలతో తెచ్చి మరీ రైతులు పోస్తున్నారు. ఒక్కో చెట్టు వద్దకెళ్లి డబ్బాతో నీళ్ల పోసి ఆ మొక్కలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ పరిసర ప్రాంతంలో చాలా మంది రైతులు ఇలానే చేస్తూ పంటను కాపాడుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. హెచ్ఎల్సి కాలువ నుంచి తొమ్మిదవ డిస్ట్రిబ్యూటరీ చివరి ఆయకట్టుకు 2600 ఎకరాలు సాగుభూమి ఉంది. ఇందులో ఇప్పటి వరకు ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేదు. దీనికి తోడు వర్షం కూడా పడలేదు. గత నెలలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రైతులు మిరప విత్తనాలు నాటారు. అవి మొలకెత్తాయి. అప్పటినుంచి ఇప్పటివరకు వర్షం రాలేదు.. సాగునీరూ వదల్లేదు. కళ్లేదుటే పంట ఎండిపోతుండడాన్ని తట్టుకోలేక రైతులు కుటుంబ సభ్యులతో కలిసి డబ్బాలతో నీరు పోసే పనికి సిద్ధం అయ్యారు. ప్రతి రైతూ నలుగురు కూలీలు, ఎద్దులు బండిలో డ్రమ్ముల ద్వారా నీటిని తీసుకెళ్లి చెట్లకు నీరు పోసే పనులు చేస్తున్నారు. ఒక మొక్కకు ఒక లీటర్ వంతున నీరువేస్తూ వాటిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఖర్చుతో కూడుకున్న పని అయినా ఇంతకంటే వేరేదారిలేక తమ శక్తినంతా దారిపోసి మొక్కలను కాపాడే ప్రయత్నం చేస్తున్నామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటను కాపాడుకోవాలని..

గత నెలలో వచ్చిన కొద్దిపాటి వర్షానికి హెచ్ఎల్సీ కింద రెండు ఎకరాల్లో మిరప పంటను సాగు చేశాను. విత్తనం వేసినప్పటి నుంచి వర్షం రాలేదు. హెచ్ఎల్సీకి సాగు నీరు కూడా వదల్లేదు. దీంతో పంటలు ఎండుదశకు చేరుకున్నాయి. చేసేది లేక ప్రతి రోజూ కూలీలను తీసుకొచ్చి డబ్బాలతో మొక్కలకు నీరు పోయిస్తున్నాను. అధికారులు సాగునీటి విడుదలపై స్పష్టతను ఇవ్వడం లేదు. పరిస్థితి ఇలానే ఉంటే ఈ ప్రాంతంలో రైతులు తీవ్రంగా నష్టపోతారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సాగునీటి విడుదలకు చర్యలు తీసుకోవాలి.

మారన్న, రైతు, బొల్లనగుడ్డం గ్రామం.

తగినంత సాగునీరు లేదు

హెచ్ఎల్సీకి ప్రస్తుతం తగినంత సాగునీరు లేదు. దీంతో ఉన్నతాధికారులు సాగునీటిని విడుదల చేయడం లేదు. వర్షం లోటు కూడా ఉండడంతో కొంత రైతులకు ఇబ్బంది ఉంది. నీటి లభ్యత మొదలవ్వగానే సాగునీటిని విడుదల చేస్తాం.

మద్దిలేటి, హెచ్ఎల్సి, డిఇ.

కామ్రేడ్ రామచంద్రారెడ్డికి ఘన నివాళి

◆ అంతిమయాత్రలో పాల్గొన్న సిపిఎం నాయకులు
◆ రామచంద్రారెడ్డి అమర్‌రహే అంటూ నినాదాలు

ప్రజాశక్తి-గుత్తి

అనంతపురం జిల్లా సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి కామ్రేడ్ రామచంద్రారెడ్డికి సిపిఎం నేతలు ఘన నివాళులు అర్పించారు. గుత్తి మండలం బసినేపల్లి గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి(76) ఇటీవల అనారోగ్యానికి గురై అనంతపురం ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి తుదిశ్వాస వదిలారు. ఆయన పార్థివదేహాన్ని బసినేపల్లి గ్రామంలోని ఆయన నివాసానికి తరలించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు తదితరులు సోమవారం ఉదయం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. రామచంద్రారెడ్డి పార్థివదేహంపై సిపిఎం జెండా కప్పి విప్లవ జోహార్లు అర్పించారు. గ్రామ శివారులో రామచంద్రారెడ్డి అంత్యక్రియలను కుటుంబ సభ్యులు, వామపక్ష సానుభూతిపరుల సమక్షంలో సోమవారం నిర్వహించారు. కామ్రేడ్ రామచంద్రారెడ్డి మతి సిపిఎంకు తీరని లోటు అని జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి బి.రామకృష్ణ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మల్లేష్, వి.నిర్మల, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ తదితరులు రామచంద్రారెడ్డికి నివాళులు అర్పించారు.

పోరాట యోధుడు రామచంద్రారెడ్డి

రామచంద్రారెడ్డి

గుత్తి మండలం బసినేపల్లి గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి పోరాట యోధునిగా గుర్తింపు తెచ్చుకున్నారు. సిపిఎం ఆధ్వర్యంలో పేదల పక్షాన అనేక పోరాటాలు సాగించారు. సిపిఎం సీనియర్ నాయకులు హంపిరెడ్డితో కలిసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేసిన ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. గ్రామానికి పదేళ్లపాటు సర్పంచిగానూ ఆయన కొనసాగారు. బసినేపల్లి గ్రామంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పేదల గుడిసెలు తొలగిస్తుండడంతో బాధితుల పక్షాన నిలిచి పోరాటం సాగించారు. నిర్వాసితులకు మరోచోట గహాలు మంజూరు కోసం పోరాటం చేశారు. దీనిపై స్పందించిన అధికారులు పేదల కోసం నాలుగు ఎకరాలు భూమిని కేటాయించి వారికి పక్కా గహాలను నిర్మించారు. దళితుల గృహాల మంజూరులోనూ ఆయన కీలకంగా వ్యవహరించారు. గ్రామంలోని బీసీ కాలనీలో విద్యుత్ సరఫరా, వీధిలైట్లు ఏర్పాటుకు హంపిరెడ్డితో కలిసి పోరాడారు. రైతులకు ప్రభుత్వ రాయితీ కింద ఇచ్చే ఎద్దులు, బండ్లను మంజూరు చేయించారు. దళితులతో పాటు పలువురికి గొర్రెల పెంపకం కోసం రాయితీ రుణాలు ఇప్పించారు. బసినేపల్లి గ్రామ అభివద్ధికి ఎనలేని కషి చేశారు. మండలంలో ప్రజా ఉద్యమాల్లో ముందుండేవారు. పేదల అభివృద్ధిని కాంక్షిస్తూ జీవితకాలం పాటు నమ్మిన సిద్ధాంతం కోసం ఆయన పని చేశారు.

ఫిర్యాదుల పరిశీలన పూర్తి చేశాం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వీడియో కాన్ఫిరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

జిల్లాలో ఓటర్ల జాబితాకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై పరిశీలన పూర్తి చేశామని కలెక్టర్ ఎం.గౌతమి తెలియజేశారు. ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి మంగళవారం ఎలక్టోరల్ రోల్స్ - స్పెషల్ సమ్మర్ రివిజన్, 2024 ఓటర్ల జాబితా తయారీపై రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షను మంగళవారం నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్‌తో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఓ గాయత్రీ దేవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం -2024లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి అనర్హుల ఓటర్లకు సంబంధించి 56,874 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటి పరిశీలన పూర్తి చేశామన్నారు. రాజకీయ పార్టీలు అందించిన ఫిర్యాదుల్లో డెత్ కేసులకు సంబంధించి 20,993 కేసులకు సంబంధించి పరిశీలన పూర్తి చేశామన్నారు. ఆయా క్లెయిమ్స్‌కు సంబంధించి ఫామ్‌లను సేకరించి ఆన్లైన్‌లో అప్లోడ్ చేశామన్నారు. పెండింగ్ ఉన్న అప్డేటెడ్ ప్రక్రియను సెప్టెంబర్ నెలాఖరులోగా త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఫారం-6, 7, 8 లకు సంబంధించి ఎలాంటి పెండింగ్ లేకుండా పరిశీలనను సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఈఆర్ఓ స్థాయిలో ఈనెల 19వ తేదీన సమావేశాలు ఏర్పాటు చేశామని, 20న జిల్లా ఎన్నికల అధికారితో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీఒలు మధుసూదన్, నిశాంత్ రెడ్డి, రవీంద్ర, హెచ్ఎస్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఈఆర్ఒలు వెంకటేశ్వర్లు, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు అనంతపురంలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని బుధవారం నాడు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. అనంతపురం అర్బన్ ప్రజల కోసం నగరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నగరంలోని కృష్ణ కళామందిర్‌లో ఏర్పాటు చేశామన్నారు. బుధవారం ఉదయం 9:30 గంటల నుంచి జగనన్నకు చెబుదాం, స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, నగర పాలక సంస్థ అధికారులు పాల్గొంటారన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అనంతపురం అర్బన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ వైద్యం : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజల ముంగిటకే వైద్య సేవలను తెచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందని మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. మంగళవారం నగరంలోని 38వ డివిజన్ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి వాకబు చేసి, ముందస్తుగానే వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా 45 రోజుల వ్యవధిలో హెల్త్‌క్యాంపులు, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం నెల రోజులపాటు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రాథమికంగా ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అర్బన్ హెల్త్‌సెంటర్లలో 64 రకాల పరీక్షలు నిర్వహించి 172 రకాల మందులను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షల తర్వాత అవసరమైతే ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు కూడా అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, సైఫుల్లా, హెల్త్ ఆఫీసర్ గంగాధర్‌రెడ్డి, డాక్టర్ రోహిత్, సచివాలయ ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో మంగళవారం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని వైసిపి నేతలు మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా సర్వే తీరును వలంటీర్లు, ఏఎన్ఎం, ఆశావర్కర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, వైస్ ఎంపిపి నరసింహులు, కమ్మ, కురుబ కార్పొరేషన్ల డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, నేతలు సుంకన్న, ఓబన్న, బసవరాజు, అశోక్ కుమార్, ఆసిఫ్, తమ్మన్న, చిన్న భీమా, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కసాపురం ఆలయంలో ఇంటి దొంగ

◆ హుండీలో చోరీకి పాల్పడ్డ సెక్యూరిటీ గార్డ్ ◆ సీసీ టీవీలో వీడియో రికార్డు

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

ఆలయం హుండీ నుంచి డబ్బులు కాజేస్తున్న సెక్యూరిటీ గార్డు

కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయంలో ఇంటిదొంగ గుట్టు రట్టు అయ్యింది. హుండీలో నగదును తస్కరిస్తూ సెక్యూరిటీ గార్డు కృష్ణారెడ్డి సీసీ టీవీకి అడ్డంగా చిక్కిపోయాడు. సోమవారం నాడు ఈ వీడియో వైరల్ కావడంతో ఈ ఘటన తీవ్ర చర్చకు దారితీసింది. ఆలయానికి రక్షణగా ఉండాల్సిన సెక్యూరిటీ గార్డు దొంగతనానికి పాల్పడడంతో దేవాలయం భద్రత, పర్యవేక్షణపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆదివారం తెల్లవారుజామున అర్చకులు నిత్యపూజాది కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సమయంలో గర్భగుడి శుభ్రం చేయడానికి అర్చకులు లోపలే ఉంటూ తలుపునకు అడ్డంగా ఒక గుడ్డ కప్పుతారు. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డ్ కృష్ణారెడ్డి హుండీలో నుంచి నగదును తస్కరించాడు. ఇదికాస్త సీసీ టీవీలో రికార్డు అయ్యింది. ఈ విషయాన్ని కొందరు సిబ్బంది ఆలయ ప్రధాన అధికారికి సమాచారం అందించారు. సీసీ టీవీని అయితే ఆలయ అధికారులు పరిశీలించి సెక్యూరిటీ గార్డు హుండీలో డబ్బులు తీసుకున్నట్లు గుర్తించారు. సుదీర్ఘకాలంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కృష్ణారెడ్డికి ఆలయంలో సీసీ కెమెరాలు ఉన్నాయన్న విషయం తెలిసి కూడా ఆయన ఎలా దొంగతనానికి పాల్పడ్డారన్న విషయం ఇప్పుడు పెద్దఎత్తున చర్చనీయాంశం అవుతోంది. అతని వెనుక కొందరు అధికారుల హస్తం ఉండడం వల్లే ఆయన ఇంత ధైర్యంగా హుండీలో డబ్బులు తీశాడనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆలయంలోని సీసీ టీవీలు ఆలయ ప్రధాన అధికారి, ఏఈఓల సెల్ ఫోన్లకు అనుసంధానం అయ్యి ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో సెక్యూరిటీ హుండీ డబ్బులను కాజేస్తున్నా అధికారులు ఎందుకు గుర్తించలేకపోయారన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. కసాపురంలో టికెట్ల రీసైక్లింగ్, తెల్లవారుజామున స్వామికి అభిషేకాలు చేయడానికి తెచ్చే పాలు, పెరుగు, అన్నదానానికి భక్తులు సమర్పించే నిత్యావసర సరుకులను కొందరు అధికారులు ఇళ్లకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటివి బహిర్గతం అవుతున్నా అధికార పార్టీ నాయకులతో పంచాయతీ నిర్వహించి పట్టుబడ్డ సిబ్బందితో లంచాలు తీసుకుని వారిని కాపాడుతున్నట్లు తెలుస్తోంది. కసాపురం ఆలయానికి భక్తుల ద్వారా పెద్ద ఎత్తున కానుకులు వస్తున్నా సదుపాయాల కల్పించడంలో నిర్లక్ష్య ధోరణి కన్పిస్తోంది. ప్రసిద్ధ ఆలయంలో ఇలాంటి అవినీతి అక్రమాలు జరకుండా ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

ప్రజాశక్తి-శింగనమల

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

రాష్ట్రంలో సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక పేదల ముంగిటకే ప్రభుత్వ పథకాలు వస్తున్నాయని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని కల్లుమడి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పాలనలో పేదల ఇంట సంక్షేమ పథకాల పంట పండుతోందన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థతో అవినీతి రహితపాలనను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమే అన్నారు. రోజురోజుకూ ప్రభుత్వంపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. ఇకపోతే ఆదరణ కోల్పోతున్న టీడీపీ వచ్చే ఎన్నికల్లో ఒంటరిగా పోటీకి దిగలేక జనసేనపై ఆధారపడుతోందని విమర్శించారు. ఎంత మంది కలసి వచ్చినా వైసిపి విజయాన్ని అపలేరన్నారు. ప్రజల భవిష్యత్తుకు తిరుగులేని గ్యారెంటీని సిఎం జగన్ ప్రభుత్వం మాత్రమే అందించడం సాధమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబ శివారెడ్డి, డిసిఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వైసిపి యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, తహశీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపిడిఒ నిర్మలకుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ శ్రీనివాసులు విద్యుత్ ఏఈ విజయ్‌కుమార్, అగ్రికల్చర్ ఏవో అన్వేష్‌కుమార్, వైసిపి నాయకుడు కొండయ్య, సర్పంచు పక్కీరమ్మ, ఎంపిటీసీ నల్లప్ప, మండల నాయకులు, మండల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జీవో 660ను రద్దు చేయాలి

కలెక్టరేట్ ఏఓ శ్రీధర్‌కు రైతుసంఘం నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కలెక్టరేట్ ఏఓ శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి రైతుసంఘంనాయకులు

రాష్ట్ర ప్రభుత్వం 2023-24 పంటల బీమాపై జారీ చేసిన 660 జిఓ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రైతుసంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగవంగా కలెక్టర్ ఎం.గౌతమి ఎన్నికల కమిషన్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉండటంతో రైతు సంఘం నేతలు ఏఓను కలిసి సమస్యలపై విజ్ఞాపన పత్రాన్ని అందించి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 నుంచి 2023 వరకూ మూడేళ్ల పంటల బీమా అమలు అనుభవం పరిశీలిస్తే రాష్ట్ర ప్రభుత్వం నేరుగా పంటల బీమా అమలు చేసిన 2020-21లో రూ.1700 కోట్లు, 2021-22లో రూ.2900 కోట్లు, రైతులకు పంటల బీమా రూపంలో ప్రయోజనం కలిగించిందన్నారు. ఉన్నతలో రైతులకు ఎక్కువ ప్రయోజనం కలిగిందన్నారు. 2022-23లో ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు జరిగి పంటలు బీమా పథకం వలన రైతులకు కేవలం రూ.1100 కోట్లు మాత్రమే బీమా పరిహారం వచ్చిందన్నారు. ఈ అనుభవం దృష్ట్యా పంటల బీమాలో ఇన్సూరెన్స్ కంపెనీల ప్రమేయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే పంటల బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కావున రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకం కోసం 8-9-2023 విడుదల చేసిన 660 జిఓ రద్దు చేయాలి కోరారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం ఇన్సూరెన్స్ కంపెనీల ప్రయోజనాలు చేకూర్చేలా ఉంది తప్పా రైతులకు మేలు చేసేలా లేదని, ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని నిలిపివేయాలన్నారు. బీమా అమలు కాని రైతులందరికి పంటల బీమా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బిహెచ్.రాయుడు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.పోతులయ్య, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి దినపత్రిక విలేకర్లు కావలెను
ప్రజాశక్తి దినపత్రికలో పనిచేసేందుకు క్రింది తెలిపిన మండల కేంద్రాల్లో విలేకర్లు కావలెను.
అర్హత : ఇంటర్ ఉత్తీర్ణత, జర్నలిజంపై ఆసక్తి, సమస్యల పట్ల అవగాహన
-: విలేకరులు కావలసిన ప్రాంతం:- -: అనంతపురం జిల్లా :-
రాప్తాడు, కూడేరు, పామిడి, వజ్రకరూర్, ఉరవకొండ రూరల్, కంబదూరు, కళ్యాణదుర్గం రూరల్, అనంతపురం రూరల్, అనంతపురం టౌన్, యల్లనూరు
ఇంటర్వ్యూ : తేది 25-09-2023 సోమవారం ఉదయం 10 గంటలకు
సంప్రదించాల్సిన ఫోన్ నెంబరు : 9490099311, 312, 313
ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయం, అనంతపురం
D.No:42/2, Near Old VRL Godown, Ballari Road, Ananthapuramu-515001.

'అనంత'ను కరువు జిల్లాగా ప్రకటించాలి

సిపిఎం ఆధ్వర్యంలో సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేత

తాడిపత్రి మండలంలో వినతిపత్రం సమర్పిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

అనంతను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో వర్షాలు పడినా దిగుబడులు వచ్చే పరిస్థితులు లేవన్నారు. దీంతో పంట సాగు చేసిన అప్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కావున మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పంట రుణాలు మాఫీ చేయాలని, పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు కనీసం ఎకరాకు రూ.50వేలు, విత్తనం వేయని రైతులకు ఎకరాకు రూ.30వేలు, హెచ్‌ఎల్‌సి 5వ డిస్ట్రిబ్యూటరీ బైపాస్ కెనాల్ పనులు పూర్తి చేసి సలకం చెరువు దాకా సాగు నీరు అందించాలని, వ్యవసాయ కార్మికులకు జీవనోపాధి కోసం ప్రతి కుటుంబానికి రూ.25వేలు ఆర్థికసాయం అందించాలని, ఉపాధి హామీ పథకంలో అదనంగా 100రోజులు పనులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను కూలీల ఖాతాలోకి జమ చేయాలని, కౌలు రైతులకు కౌలు రద్దు చేసి నష్టపరిహారం ఇవ్వాలని, పంటల బీమాలో ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుని ప్రభుత్వ రంగంలోనే బీమా కొనసాగించాలని, వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ ఇవ్వాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని, 90 శాతం సబ్సిడీతో పప్పుశెనగ మంజూరు చేయాలని, కౌలు రైతు కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, రేషన్ దుకాణాల్లో 14 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలని, రాచేపల్లి లిడ్ క్యాప్ చెప్పుల పరిశ్రమ ప్రారంభించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకన్న, జయరాముడు, ఎర్రిస్వామి, ఆంజనేయులు, సూర్యప్రకాష్, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, కుళ్లాయిస్వామి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : తాడిపత్రి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి తక్షణం కరువు సహాయక చర్యలు చేపట్టాలని రైతుసంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని చిన్నపొలమడ, పెద్ద పొలమడ, ఎర్రగుంటపల్లి, దిగువపల్లి గ్రామ సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయన్నారు. వర్షాభావంతో రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రాకపోవడంతో అప్పులు ఎలా కట్టాలో తెలియక రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. కావున ప్రభుత్వం కరువు తక్షణ సహాయక చర్యలు చేపట్టడంతోపాటు తాడిపత్రి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, రెడ్డి రమేష్, చెన్నారెడ్డి, నాగరాజు, కృష్ణయ్య, రామకృష్ణారెడ్డి, రామాంజనేయులురెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని 2వ సచివాలయంలో సచివాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వర్షాలు కురవకపోవడంతో పంట చేతికందక రైతులు తీవ్ర ఇబ్బందులు అవుతున్నారన్నారు. మరోవైపు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటుండటంతో బోర్ల కింద కూడా పంటలు ఎడిపోతున్నాయన్నారు. కావున ఎండిపోతున్న పంటలకు నష్టపరిహారాన్ని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులు, వ్యవసాయ కూలీలు పనులు కోల్పోయినందున ఉపాధి హామీ పథకం కింద అదనంగా వంద రోజుల పని కల్పించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను చెల్లించాలని, ఎపిఐఐసి, ఎపిబిఐసి డ్యామ్ ద్వారా అన్ని చెరువులను నింపాలని, హెచ్‌ఎల్‌సి ఆధునీకరణ పనులు చేయాలని, 5వ బైపాస్ కాలువ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జయమ్మ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లులో వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

గుంతకల్లు రూరల్ : గుంతకల్లు మండలాన్ని కరువు మండలం ప్రకటించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బి.రామతులసమ్మ కసాపురం సచివాలయ అధికారికి వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ అత్యల్ప వర్షం నమోదు కావడంతో మండలంలోని సాగు విస్తీర్ణం 40 శాతానికి తగ్గిపోయిందన్నారు. ఈనేపథ్యంలో రైతులు కనీసం పెట్టుబడి రాక అప్పుల పాలయ్యారన్నారు. కాబట్టి రైతులకు రుణమాఫీ ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కరువు దృష్ట్యా చౌక దుకాణాల్లో 14 రకాల సరుకులను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు జగ్గలి రమేష్, కసాపురం రమేష్, పట్టణ కమిటీ సభ్యులు జాకీర్, తిమ్మప్ప, రామునాయక్, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి చరణ్, మద్దికెర ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

తల్లిని కడతేర్చిన తనయుడు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

వివరాలు తెలియచేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో కన్నతల్లి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన కంబదూరు మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. డీఎస్పీ శ్రీనివాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... కంబదూరు మండల కేంద్రానికి చెందిన గోపీనాథ్, సుజాతకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ప్రణీత్ ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లి చేశారు. ప్రణీత్ మాత్రం ఇంటర్ ఫెయిలై చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. దీంతో తరుచూ డబ్బులు కావాలని తల్లిదండ్రులను కొట్టడం, హింసించేవాడు. ఈ విషయమై బంధువులు ఎన్నిసార్లు మందలించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇంటి పక్కనే సోమవారం కూడా మద్యం తాగేందుకు డబ్బులు కావాలని తల్లిని వేధించాడు. ఇందుకు ఆమె నిరాకరించడంతో ఇంట్లో మంచంపై నిద్రిస్తున్న సుజాతపై పెట్రోల్ పోసి నిప్పంటించి పారిపోయాడు. చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పరారీలో ఉన్న నిందితుడు ప్రణీత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఒక్కరోజులోనే హత్య కేసును చేధించిన సీఐ తేజమూర్తి, ఎస్ఐ రాజేష్‌ను డీఎస్పీ ప్రశంసించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మృతిచెందిన జగదీష్

ఆత్మకూరు : మండల కేంద్రంలో హైవేపై సోమవారం తెలుగువారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అమరాపురం నుంచి హైదరాబాదుకు మండల కేంద్రం మీదుగా వెళ్తున్న ఐచర్, ఎదురుగా వచ్చిన సిమెంటు ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఐచర్ బోల్తా పడింది. దీంతో ఐచర్ వాహనంలో ప్రమాణిస్తున్న కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గానికి చెందిన శివన్నగారి జగదీష్ (25) అక్కడికక్కడే మృతిచెందాడు. చితప్ప, నాగరాజుకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను 108 ద్వారా అనంతపురం ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ రవిప్రసాద్ తెలిపారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

నాటుసారా పట్టివేత

గుత్తి : గుత్తి స్టేషన్ పరిధిలోని పామిడి మండలం దేవరపల్లి వద్ద సెబ్ సీఐ బి.వరలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం నాటుసారా విక్రేతను అరెస్టు చేశారు. కదిరిపల్లికి చెందిన ప్రసాద్‌నాయక్ ద్విచక్ర వాహనంలో 30 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు సిఐ తెలిపారు. ద్విచక్ర వాహనం, నాటుసారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు వెల్లడించారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

గుత్తి : మండలంలోని వివిధ ప్రాంతాల్లో వేర్వేరుగా జరిగిన ప్రమాదాల్లో పలువురుకి గాయాలయ్యాయి. మండలం కొత్తపేట గ్రామం వద్ద 63వ జాతీయ రహదారిపై మంగళవారం బైక్ అదుపుతప్పి రాజుకు తీవ్రగాయాలయ్యాయి. రాజు పట్టణంలోని జంగాల కాలనీలో నివాసం ఉంటూ ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలో వ్యాపార అనంతరం స్వగ్రామానికి వస్తుండగా కొత్తపేట సమీప వద్దకు రాగానే బైకు అదుపుతప్పి కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తురకపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ ప్రసాద్ గుత్తి నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మరో ఘటనలో యాడికి మండలం చందన గ్రామానికి చెందిన ఆంజినేయులు బైక్‌పై గుత్తి నుంచి చందనకు బయలుదేరాడు. స్థానిక పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఆంజనేయులుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో అదనపు చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. మండలంలోని కొజ్జేపల్లి గ్రామ సమీపంలో 63వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. టీ.కొత్తపల్లి గ్రామానికి చెందిన వంశీ అనే యువకుడు తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంలో గుత్తికి వస్తుండగా అది అదుపు తప్పి బోల్తా పడింది. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో అదనపు చికిత్సకై అనంతపురం సర్వజన ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆయా ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నల్లాని రాజేశ్వరికి అంతర్జాతీయ సేవారత్న అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త నల్లాని రాజేశ్వరి అంతర్జాతీయ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఈమేరకు అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (ఏఎఫ్ఏ) వ్యవస్థాపక అధ్యక్షులు తోటకూర ప్రసాద్, అధ్యక్షులు మురళీ వెన్నెం, కార్యదర్శి రవి కొండబోలు మంగళవారం లేఖ పంపారు. ఈనెల 23న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞానమందిరంలో జరిగే అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి ఉత్సవాల్లో అవార్డును ప్రదానం చేయనున్నారు. కాగా నల్లాని రాజేశ్వరి విద్యావేత్త, సామాజిక కార్యకర్త, రచయిత్రి, కవయిత్రి, కాలమిస్ట్‌గా బహుముఖ సేవలందిస్తున్నారు. అంతేగాకుండా జిల్లా బాలల సంక్షేమ సమితి (సి.డబ్ల్యు.సి) ఛైర్‌పర్సన్‌గా పని చేశారు. మహిళా సాధికారత కోసం చేస్తున్న కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం నుంచి 2015లో రాజ్య మహిళా సమ్మాన్ అవార్డును అందుకున్నారు. దీంతోపాటు పలు సేవాల పథకాలను అందుకున్న ఘనత ఆమెకే దక్కుతుంది. ఇకపోతే అంతర్జాతీయ సేవారత్న అవార్డుకు తనను ఎంపికజేసిన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వ్యవస్థాపక అధ్యక్షులు, కార్యదర్శులకు రాజేశ్వరి ధన్యవాదాలు తెలిపారు. సేవారత్న అవార్డుకు రాజేశ్వరి ఎంపికవడం పట్ల ప్రముఖ విద్యావేత్తలు పతికి రమేష్ నారాయణ, గొర్తి వెంకటస్వామి, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమనాయుడు, హైకోర్టు న్యాయవాది, బిసిఆర్ పిఎస్ అధ్యక్షులు సాకే నరేష్. తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

వైసిపి పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని వైసీపీ అర్బన్, నియోజకవర్గ రూరల్ కన్వీనర్‌గా నియమితులైన హుస్సేన్ మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్ నాయకత్వంలోని వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో అమలు చేసిన హామీలను ప్రజలకు వివరించాలన్నారు. ముఖ్యంగా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకే నూతన కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్బన్ నియోజకవర్గ పరిధిలో ఐదు క్లస్టర్లను ఏర్పాటు చేసి ఇప్పటికే జెసిఎస్ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆశాబీ, జెసిఎస్ కన్వీనర్ ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ఉమ్మడి మదన్మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ చంద్ర, ఎంపిటిసి సంధ్య, వైసిపి నేతలు మల్లెల వేణుగోపాల్, జగన్‌మోహన్‌రెడ్డి, అంజీ, రహీం, దౌలా, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, కార్పొరేటర్ సైపుల్లా బేగ్, తదితరులు పాల్గొన్నారు. కాగా వైసిపి రాష్ట్ర కార్యదర్శి గౌస్‌బేగ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి నివాసంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు.

రాయలసీమ ద్రోహి జగన్

బుక్కరాయసముద్రం : రాయలసీమ ద్రోహి సిఎం జగన్ అని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య విమర్శించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ కర్నూలు జిల్లా డోన్ సభ నుంచి మాట్లాడిన ప్రతి మాట అబద్ధమేనన్నారు. రాయలసీమ నీటి కష్టాలు తెలుసు అని చెబుతున్న జగన్ నాలుగున్నరేళ్లలో నువ్వేం చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కింద తాగునీరు సాగునీరు అందించి అన్ని చెరువులకు నీటిని నింపాల్సిన జగన్ చేయలేకపోయారన్నారు. గత ప్రభుత్వాలు ప్రారంభించి పూర్తి చేస్తున్న వాటిని చూపించి మాట్లాడుతున్న జగన్.. ఎందుకు రాయలసీమ ప్రాంతంలో కొత్త ప్రాజెక్టుల విషయంపై మాట్లాడటం లేదన్నారు. ముఖ్యంగా జిల్లాలోని హెచ్ఎల్‌సి కెనాల్‌ని ఎందుకు ఆధునీకరించలేదో ప్రజలకు చెప్పాలన్నారు. అలాగే జగన్ చెబుతున్న అడ్మినిస్ట్రేషన్, ఆసుపత్రి, పాఠశాలలు, మహిళలకు చేయూత, సామాజిక న్యాయంపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. అప్పులు తెచ్చి పరిపాలన సాగించడం తప్ప ఉద్యోగ కల్పన లేక, పారిశ్రమలను తీసుకురాక, ఎలక్షన్లకు సమీపిస్తున్న తరుణంలో జీవోలు తెచ్చి టెంకాయలు కొట్టి డబ్బులు దోచే కార్యక్రమాలకు పాల్పడుతున్న జగన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో పతనం తప్పదని హెచ్చరించారు.

తుంపెరలో సమస్యలు పరిష్కరించాలి

నార్పల : మండల పరిధిలోని గంగనపల్లి పంచాయతీలో ఉన్న తుంపెర గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఎంఆర్‌పిఎస్ నాయకులు మంగళవారం తుంపెర గ్రామంలో పర్యటించారు. ముఖ్యంగా గ్రామంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే దారి మురుగునీటితో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోందన్నారు. దీంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారన్నారు. అలాగే ఎస్సీ కాలనీకి ఆనుకుని ఉన్న శ్మశాన వాటికను కబ్జాదారుల నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రంగాపురం పుల్లప్ప, నాయకులు హనుమంతు, చిన్న ఆంజనేయులు, పెద్ద గంగయ్య, మండల అధ్యక్షులు ఎస్‌వి.రమణ, ఉపాధ్యక్షులు మేకల రాజు, రామకృష్ణ, నారాయణ, ఆదినారాయణ, ఎర్రినాగప్ప, బయన్న పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, KADAPA
I.P.No. 16 / 2018
1) Murukuti Sreenivasulu Reddy,S/o Pakkira Reddy, aged about 44 years, Hindu, Cultivation, Residing of Vempalle Village and Mandal, Kadapa District, Presently working at Hyderabad.
...Petitioner
Vs
59. Peddireddy Sujatha, W/o P.Suresh Kumar Reddy, aged 38 years, Housewife, Resident of D.No.1/49, near Municipal Office, Tadipatri, Anantapuram District.
...Respondent No. 59
NOTICE TO RESPODNENT No. 59
పై దావాలోని పిటీషనర్ తనను Insolventగా తీర్మానించమని కోరుచూ పై I.P. దాఖలు చేసి ఉన్నాడు. సదరు I.P.లో మీ హాజరు నిమిత్తమై వాయిదా 29.09.2023న ఉన్నది. కావున మీరు ఆ దినము అనగా 29.09.2023న ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
//By Order of Court//
U.OBAIAH
Advocate For Petitioner

జడ్జికి బొకే అందజేస్తున్న ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్

కలెక్టర్, జడ్జిని కలిసిన ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లా జడ్జి, కలెక్టర్‌ను ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ మంగళవారం వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా జడ్జి శ్రీ జి.శ్రీనివాస్, తర్వాత కలెక్టర్ ఎం.గౌతమిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

రాయదుర్గం : ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి 23వ తేదీ శనివారం వరకూ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు పని చేస్తాయని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత బస్టాండ్ వద్ద ఉన్న 11వ సచివాలయం, కోటవీధి అభ్యుదయ పాఠశాల ఎదురుగా 14వ సచివాలయం, శాంతినగర్‌లోని చిన్న జమ్మిచెట్టు వద్ద 18వ సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కావున ఐదేళ్ల నుంచి 15ఏళ్లలోపు 15 సంవత్సరాలు పైబడిన వారికి కొత్తగా ఆధార్ నమోదు, మొబైల్ నెంబర్ లింక్, చేర్పులు మార్పులు, 60 సంవత్సరాలు పైబడిన వారికి బయోమెట్రిక్ అప్‌డేట్ చేయనున్నట్లు తెలిపారు.

పకడ్బందీగా ఎన్నికల సర్వే

ఉరవకొండ : నియోజకవర్గంలో ఎన్నికల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎన్నికల ప్రత్యేక కలెక్టర్ శంకరయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల తహశీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటి సర్వేలో వచ్చిన ఫారం 6, 7, 8పై చర్చించారు. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ చేపట్టిన అనంతరం తీసుకున్న నిర్ణయాలపై చర్చించడంతోపాటు ఓటర్ కేంద్రాలు, మార్పులు, చేర్పులు, కొత్తవి ఏర్పాటు చేసే అంశాలపై మాట్లాడుతూ ప్రతి ఓటర్ కేంద్రం పరిధిలో ఇంటింటి సర్వే జాగ్రత్తగా చేయాలని, ఎన్నికల సర్వేలో ఆలసత్వం చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మునీంద్ర, సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

ఉరవకొండ : ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ రేట్లకు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి శుభకర్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా భవానీ ఫర్టిలైజర్ షాప్‌లో ఫిజికల్ స్టాకుకు..ఆన్‌లైన్ డిబిటి స్టాకుతో పోల్చి పరిశీలించారు. అదేవిధంగా భరత్, ఉమామహేశ్వర ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. త్వరలో రబి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏ డీలర్ కూడా ఎరువుల విషయంలో కానీ, మరే విషయంలో గానీ కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

నైపుణ్యంతో విద్యనభ్యసించాలి

అనంతపురం : వివిధ పారామెడికల్ కోరుల్లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు మంచి నైపుణ్యంతో విద్యను అభ్యసించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఇబి.దేవి సూచించారు. మంగళవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి కార్యాలయం సమావేశ భవనంలో జిల్లాలోని ప్రయివేటు పారామెడికల్ ట్రైనింగ్ కళాశాలల్లోని కోర్సులకు కౌన్సిలింగ్ నిర్వహిచారు. దాదాపు 11 కళాశాలలకు మెరిట్ ఆధారంగా సీట్లను భర్తీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ పారామెడికల్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు మంచి నైపుణ్యంతో విద్యను అభ్యసిస్తే మంచి ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చెన్నకేశవులు, పరిపాలన అధికారి గిరిజ మనోహర్‌రావు, సూపరింటెండెంట్ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్సీ సోషియల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ రవికాంత్, సీనియర్ అసిస్టెంట్లు సురేష్, కమలాకర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి చేయాలి

ఉరవకొండ : పట్టణంతోపాటు మండలవ్యాప్తంగా వైసిపి బలోపేతానికి ప్రతిఒక్క కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని వైసిపి బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న పిలుపునిచ్చారు. ఉరవకొండ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి సూచనల మేరకు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల సమన్వయకర్త ఓబన్న, పట్టణ, మండల (రూరల్) అధ్యక్షులు ఏసీ ఎర్రిస్వామి, ముష్టూరు సుంకన్నతో కలిసి 60 మందితో నూతన కమిటీలను ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ నూతన కమిటీ సభ్యులు అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. ముఖ్యంగా ప్రజలతో మమేకం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి నరసింహులు, కమ్మ, కురుబ కార్పొరేషన్ల డైరెక్టర్లు తేజోనాథ్, గోవిందు, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మీరం బాషా, పిఎసిఎస్ ఛైర్మన్ వడ్ల షేక్షావలి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పెన్నఅహోబిలం మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, జెసిఎస్ పట్టణ కన్వీనర్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

24న జిల్లాస్థాయి యోగాసన పోటీలు

అనంతపురం : జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రాజశేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ ఇఎన్.మారుతీప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం అనంతపురంలోని వివేకానంద భవన్ రెవెన్యూ కాలనీ రామచంద్రనగర్‌లో పోటీలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు సెల్..70138 87386, 94412 52258, 94949 33307 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

డీజే స్పీకర్లు వితరణ

శింగనమల : మండలంలోని నిదనవాడ గ్రామ యువతకు కంచిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.25వేల విలువజేసే డీజే స్పీకర్స్‌ను జడ్పిటిసి కంచిరెడ్డి సుధారెడ్డి, భాస్కర్‌రెడ్డి వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కంచిరెడ్డి కృష్ణారెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, రమేష్, నిదనవాడు సర్పంచి శ్యామలమ్మ, ఎంపిటిసి సునీత, గుత్తిరెడ్డి అమర్నాథ్, చింతంరెడ్డి పెద్దారెడ్డి, ఎస్పీ నారాయణరెడ్డి, దివాకర్‌రెడ్డి, రామాంజనేయులు, నిదనవాడ గ్రామ ప్రజలు, నాయకులు, పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

పుట్లూరు : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని వడ్డెర బిసి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ వద్ద అన్నదానం చేశారు. మండల కమ్యూనిస్టు యూత్ లీడర్ వి.సురేష్, వి.వెంకటశేఖర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కుల మతాలకు అతీతంగా అన్నదానంలో పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మిత్రులు హరి, బాలరాజు, నారాయణస్వామి, మల్లి, రాజా, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండలం కేంద్రంలోని ఆత్మా రామాలయం వద్ద రామ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శింగనమల గుడ్డల రాముడు, సమీమణి లక్ష్మీదేవి కుటుంబ సభ్యులు అన్నదానానికి సహకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ గణేష్ ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలపై కేసులు దుర్మార్గం

రిలే దీక్షల్లో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో ప్రతిపక్షాలు లేకుండా చేయాలనే దిగజారుడు రాజకీయాలు చేస్తూ కక్షసాధింపుతో అక్రమ కేసులు, అరెస్టులకు పాల్పడి అణచివేయాలనుకోవడం దుర్మార్గమని టిడిపి యువనేత వైకుంఠం మధుకర్‌చౌదరి అన్నారు. చంద్రబాబును విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ టిడిపి అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఆధ్వర్యంలో రామ్‌నగర్‌లోని కమ్మభవన్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 7వరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా యువనేత మధకర్ చౌదరి మాట్లాడుతూ రిలే నిరాహార దీక్షలకు జనసేన, కమ్యూనిస్టులు, కలిసి రావడం శుభ పరిణామం అన్నారు. రాష్ట్రంలో ఒక అవినీతిపరుడు, అవినీతి బురద అందరికీ అంటించాలని చూస్తున్నాడని, ఇది అందరికీ కష్ట సమయమని అన్నారు. కష్టాలు ఎన్నో రోజులు ఉండవని, వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయదుందుభి మోగిస్తుందన్నారు. ఈ దీక్షలో తెలుగు యువత నాయకులు జయనాథ్‌రెడ్డి, సుధాకర్‌యాదవ్, బొమ్మినేని శివ, కులశేఖర్ నాయుడు, బంగి నాగ, లోక్‌నాథ్‌రెడ్డి, గుత్తా ధనుంజయనాయుడు, లక్ష్మీనరసింహా, సరిపూటి శ్రీకాంత్, వెంకటరామయ్య, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ మండలకేంద్రంలో చేపట్టిన టిడిపి రిలేదీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ప్రజల్లో ఇక గెలవలేమని భావించిన సిఎం జగన్ ఇలాంటి అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా చంద్రబాబు బయటకు వచ్చి సిఎం కావడం ఖామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి గంజి నాగరాజు, గాండ్ల కార్పొరేషన్ అధ్యక్షురాలు విశాలాక్షి, కురుబ సాధికార కమిటీ అధ్యక్షులు రమణ, వడ్డే సాధికార కమిటీ అధ్యక్షులు వెంకట్, శాలివాహన సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మదనపు పోతులయ్య, ఇల్లూరు రామాంజనేయులు, పుట్లూరు బ్రహ్మయ్య, వడ్డెర సాధికార కమిటీ అధ్యక్షులు వన్నూరు, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ మాసుల చంద్రమోహన్, రాగే పరశురాముడు, మండల పార్టీ కన్వీనర్లు ఎర్రినాగప్ప, పాండు అశోక్, వాల్మీకి జిల్లా డైరెక్టర్ బొగ్గ నారాయణస్వామి, కొయ్యగూర పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఉరవకొండలో అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారాన్ని అడ్డు పెట్టుకుని నిరంకుశ పాలనకు తెరలేపిందని విమర్శించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాడని, ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే వారి నమ్మకాన్ని వమ్ము చేస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులను అక్రమ అరెస్టులు చేయడానికి పూనుకున్నారన్నారు. తద్వారా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి వన్నూరుస్వామి, మణి, ముత్యాలు, ధనుంజయ్య, సర్పంచు చంద్ర, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు లక్ష్మీనారాయణ, భారత్, శివ, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం దీక్షల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతురాయచౌదరి, టిడిపి నాయకులు

కళ్యాణదుర్గం : నిజానిజాలు నిగ్గుతేల్చాల్సిన అధికారులు తప్పుడు కేసులు పెట్టడమే కాకుండా అసత్య ప్రెస్‌మీట్లు పెట్టడం శోచనీయమని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతురాయచౌదరి అన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పట్టణంలో చేపట్టిన ఆందోళన మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఐడీ అధికారి సంజయ్, ప్రముఖ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైదరాబాద్, ఢిల్లీలో ప్రెస్‌మీట్‌లు పెట్టి తప్పుడు మాటలు మాట్లాడటం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. తప్పు జరిగితే అధికారులపై చర్యలు తీసుకోవాలేగానీ, పాలసీపై నిర్ణయం తీసుకున్న చంద్రబాబుపై ఎలా కేసులు పెడతారన్నారు. గతంలో వైఎస్ఆర్ ప్రభుత్వంలో తప్పు జరిగితే శ్రీలక్ష్మి, రత్నప్రభపై సీబీఐ చార్జీ పెట్టిన విషయం గుర్తుచేసువాలన్నారు. ఇప్పటికైనా అధికారులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోరేపల్లి మల్లికార్జున, ఉన్నం మారుతి, రామ్మోహన్‌చౌదరి, వైపీ.రమేష్, శ్రీనివాసరెడ్డి, గోళ్ల వెంకటేశులు, శివన్న, మాజీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఐ, వైసిపి నాయకులు

గుత్తి : వినాయక చవితి సందర్భంగా మండలంలో కొలువుదీరిన గణేష్ ప్రతిమలను బుధవారం నిమజ్జనం చేసేందుకు పోలీసులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈమేరకు సీఐ ఎన్.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని తురకపల్లి గ్రామ సమీపంలో వినాయక నిమజ్జనం ఘాట్ పరిశీలించారు. ఇందులో భాగంగా వైసీపీ జిల్లా నాయకులు మణికంఠ మెటల్ స్టోన్ క్రషర్స్ అధినేత కె.మధుసూదన్ రెడ్డి తన సొంత నిధులతో టిప్పర్ల ద్వారా ఎర్రమట్టిని తరలించారు. వినాయక ప్రతిమల వాహనాలు వెళ్లేందుకు రహదారులను జెసిబిల ద్వారా చదును చేయించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్న గట్టి బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హనుమంతు, వైసిపి నాయకులు సివి రంగారెడ్డి, బోయగడ్డ రాము తదితరులు పాల్గొన్నారు.